ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 334 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శనివారం 14 మార్చి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## నేటినుంచి పదో తరగతి పరీక్షలు
### భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు



**హైదరాబాద్, మార్చి 13 (ప్రభాత ఉదయం):**

తెలంగాణ రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ భారీగా ఏర్పాట్లు చేసింది. పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. హాల్ టిక్కెట్ చూపిస్తే దిగాల్సిన చోటు వరకు ఉచితంగా ప్రయాణం కల్పిస్తారు. ఇకపోతే పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని అధికారులు సూచించారు. ఐదు నిముషాల ఆలస్యాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,28,239 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో ..మిగతా 2లో

## మాజీ డీజీపీ హెచ్‌జే దొర కన్నుమూత
### హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

**హైదరాబాద్, మార్చి 13 (ప్రభాత ఉదయం):**



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్‌జే దొర (82) కన్నుమూశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి ఇవాళ విషమించడంతో, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. హెచ్ జే దొర కొంతకాలంగా కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నారు. ఆయన క్రమం తప్పకుండా డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఉదయం హైదరాబాద్ లోని నిమ్స్ లో డయాలసిస్ చేయించుకుని ఇంటికి వెళ్లారు. ఆ తర్వాత ఆయన బాత్రూంలో పడిపోయినట్టు తెలుస్తోంది. హెచ్‌జే దొర ..మిగతా 2లో

## మూసీ నిరాశ్రయులకు
# ఆయా నియోజకవర్గాల్లోనే ఇళ్లు



### మూసీకి 20 టీఎంసీల గోదావరి జలాలు
### నదులను ఆక్రమించుకోవడం వల్లనే వరదలు
### ఎవరు సూచనలు ఇచ్చినా తీసుకునేందుకు సిద్ధం
### మూసీ ఇన్వైట్స్ కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 13 (ప్రభాత ఉదయం):**

మూసీ పునరుజ్జీవ పథకం అమలులో ఏవైనా లోపాలుంటే సూచనలు, సలహాలు ఇస్తే స్వీకరిస్తామని, మరింత అద్భుతంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తామని, అసలు పథకమే వద్దంటే మాత్రం వినే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తేల్చి చెప్పారు. తమ ప్రభుత్వం పేదలకు శత్రువు కాదని, వారిని నిరాశ్రయులను చేసే ఆలోచన లేదని స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవంలో నిరాశ్రయులకు ఆయా నియోజకవర్గాల్లో ప్రభుత్వ స్థలం ఉంటే.. అక్కడే ఇళ్లు కట్టించి ఇస్తామని ప్రకటించారు. ఈ ప్రాజెక్టు ఎవరికి వ్యతిరేకం కాదని, ఎవరి ఆస్తులూ గుంజుకునేందుకు కాదని అన్నారు. పేదలతో శత్రుత్వం పెంచుకుంటే మళ్లీ ఎవరైనా అధికారంలోకి వస్తారా? అని ప్రశ్నించారు.

ఇది భవిష్యత్ తరాల కోసం చేస్తున్న అభివృద్ధి అని, ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడుకోవడం మన కర్తవ్యమని పేర్కొన్నారు. దాదాపు 115 సంవత్సరాల కిందట అప్పటి నిజాం నవాబు ఎంతో దూరదృష్టితో చేసిన మంచి పనుల్లో కనీసం మనం పది శాతం కూడా చేయకుండా ఈ నగరాన్ని అలాగే వదిలేద్దామా? అని ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో 'మూసీ ఇన్‌వైట్'పేరుతో ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తర్వాత ప్రజా ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పర్యావరణవేత్తలు, మేధావులు, పలు సంస్థల కన్సల్టెంట్లను ఉద్దేశించి సీఎం మాట్లాడారు.

**బ్యూటిఫికేషన్.. లూటిఫికేషన్ అంటూ అసత్యాలు**

'ప్రభుత్వం మంచి కార్యక్రమం చేపడుతున్నప్పుడు ..మిగతా 2లో

## నిజామాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం




### టూరిస్ట్ బస్సు బోల్తాపడి నలుగురు మృతి
### క్షతగాత్రులను ఆస్పత్రికి తరలింపు
### సహాయక చర్యలు చేపట్టిన పోలీసులు
### నిజామాబాద్ జిల్లాలో ఘటన

**నిజామాబాద్, మార్చి 13 (ప్రభాత ఉదయం):**

నిజామాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇందల్వాయి మండలంలోని గన్నారం శివారులో ఉన్న బ్రహ్మంగారి ఆలయం సమీపంలో 44వ జాతీయ రహ దారిపై టూరిస్ట్ బస్సు అర్ధరాత్రి 2 గంటల సమయంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ..మిగతా 2లో

## రాజ్యాంగ రక్షణ అంటే ఫిరాయింపులను ప్రోత్సహించడమా
### రాహుల్ గాంధీ తీరుపై హరీశ్ రావు ఆగ్రహం

**హైదరాబాద్, మార్చి 13 (ప్రభాత ఉదయం):**



కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ రాజ్యాంగం చేతబట్టి దేశమంతా నీతిసూత్రాలు చెబుతున్నారని, కానీ ఆ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం ప్రభుత్వం మరోలా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో రాహుల్ గాంధీపై, కాంగ్రెస్ పార్టీ తీరుపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ఈ మేరకు రాహుల్ గాంధీకి లేఖ రాశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుతామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ చెప్పిందని గుర్తు చేశారు. అలాగే రాహుల్ గాంధీ కూడా దేశమంతా నీతిసూత్రాలు చెబుతున్నారని ..మిగతా 2లో

## మూసీ నీటితో రైతులకు
# మేలు జరిగితే స్వాగతిస్తాం

### పేదల ఇళ్లు కూల్చడంపైనే మా అభ్యంతరం
### మూసీ ప్రక్షాళనను ఎప్పుడూ వ్యతిరేకించలే
### మూసీకి ముందు సబర్మతిపై అధ్యయనం చేయండి
### తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు



**హైదరాబాద్, మార్చి 13 (ప్రభాత ఉదయం):**

మూసీ ప్రాజెక్ట్‌పై బీజేపీకి వ్యతిరేకత లేదని.. కాని పేదల ఇళ్లు కూల్చుడాన్ని మాత్రం వ్యతిరేకిస్తామని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా రాంచందర్ రావు శుక్రవారం హైదరాబాద్‌లో మాట్లాడారు. మూసీపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ పట్ల బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. మూసీ నది పునరుజ్జీవనానికి కానీ.. మూసీ ప్రాజెక్ట్‌ను కానీ బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకించలేదని తెలిపారు. మూసీ నది హైదరాబాద్ నగరం నుంచి కృష్ణానదిలో కలిసే వరకు పరిశుభ్రంగా ఉండాలని.., అందులో స్వచ్ఛమైన నీరు ప్రవహించాలని.. ఆ నీరు రైతులకు సాగునీటి కోసం ఉపయోగపడాలని తమ పార్టీ కోరుకుంటోందని తెలిపారు. అయితే ఈ అంశంపై కాంగ్రెస్ నేతలు పదేపదే తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి కానీ, మంత్రి పొన్నం ప్రభాకర్ కానీ.. బీజేపీపై రకరకాల వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. కానీ మూసీ విషయంలో బీజేపీ వైఖరి మొదటి నుంచీ ఒకటేనని గుర్తు చేశారు. మూసీ నది తప్పకుండా పునరుజ్జీవనం కావాలని తమ పార్టీ ఇప్పటికీ చెబుతుందన్నారు. కానీ 'గాంధీ సరోవర్' పేరుతో అక్కడ నివసిస్తున్న పేద, మధ్య తరగతి కుటుంబాల ఇళ్లను కూల్చడం అంగీకారయోగ్యం కాదన్నారన్నారు. మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ వంటి ప్రాంతాల్లో చట్టబద్ధంగా నిర్మించిన ఇళ్లను కూల్చాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆ ఇళ్లను కూల్చకుండానే మూసీని శుద్ధి చేయవచ్చునన్నారు. సబర్మతి నదిని ఉదాహరణగా తీసుకునే వారు.. ముందుగా అసలు అక్కడ ప్రాజెక్టు ఎలా ఏర్పాటు చేశారో తెలుసుకోవాలంటూ ..మిగతా 2లో



## టెహ్రాన్‌లో భారీ పేలుడు
### పేలుడులో ప్రాణనష్టంపై ఇరాన్ నుంచి రాని అధికారిక ప్రకటన
### ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య పతాక స్థాయికి చేరిన ఉద్రిక్తతలు

# మూసీ నిరాశ్రయులకు ఆయా నియోజకవర్గాల్లోనే ఇళ్లు

**మొదటి పేజీ తరువాయి...**

మేధావులు దానిని సమర్థించేలా మాట్లాడాలి. కొన్ని రాజకీయ పార్టీలు కడుపులో కుళ్లు, మాటల్లో విషం, చూపుల్లో పగతో వ్యవహరిస్తున్నాయి. రాజకీయ స్వార్థం కోసం ఘనమైన చరిత్రను కాలగర్భంలో కలిపేలా వ్యవహరిస్తున్నాయి. అక్రమ సంపాదనతో ప్రతీనెలా రూ.5 కోట్లు వ్యయం చేస్తూ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారు. మూసీ బ్యూటిఫికేషన్.. లూటిఫికేషన్ అంటున్నారు. ప్రజలను ఆందోళనకు గురిచేసేలా కొంతమంది ఉద్దేశ పూర్వకంగా, మరికొందరు అసంపూర్ణ సమాచారంతో అర్ధ సత్యాలను ప్రచారం చేస్తున్నారు.



**గాంధీ విగ్రహానికి రూ.75 కోట్లు మాత్రమే..**

రూ.5 వేల కోట్లతో గాంధీ విగ్రహం అంటూ సొంత తెలివి ప్రదర్శిస్తున్నారు. నిజానికి గాంధీ విగ్రహానికి అయ్యే వ్యయం రూ.75 కోట్లు మాత్రమే. ఈ ప్రాజెక్టు మొత్తం 55 కిలోమీటర్లు కాగా.. తొలిదశలో గాంధీ సరోవర్ వరకు 21 కిలోమీటర్ల అభివృద్ధికి అయ్యే వ్యయం కేవలం రూ.7 వేల కోట్లు మాత్రమే. మహాత్ముడి సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్ళాల్సిన బాధ్యత మనపై లేదా? మన చరిత్రను తిరిగి రాసుకునే అవకాశాన్ని మనం వదులుకుందామా? దేవతలు యజ్ఞాలు చేసినపుడు రాక్షసులు భగ్నం చేసే ప్రయత్నం చేశారు. సుబాహు, మారీచుడు అడ్డుకునే ప్రయత్నం చేస్తే లోక కళ్యాణం కోసం చేసే యజ్ఞం ఆగిందా? లోకకళ్యాణం కోసం చేసే పనులకు సహకరించక పోయినా పరవాలేదు. కానీ అడ్డుకునే ప్రయత్నం మాత్రం చేయొద్దు..' అని సీఎం విజ్ఞప్తి చేశారు.

నది చుట్టూనే నాగరికత అభివృద్ధి: 'మానవ నాగరికత నది చుట్టూనే అభివృద్ధి చెందింది. 1908 మూసీ వరదలు నగరాన్ని ముంచెత్తిన తర్వాత.. నగరాన్ని కాపాడుకోవాలనే ఉద్దేశంతో అప్పటి నిజాం ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లను నిర్మించారు. ప్రస్తుతం వందేళ్లు దాటినా ఆ రిజర్వాయర్లు నగర ప్రజలతో పాటు, వలసలు వచ్చిన లక్షలాది మంది దాహార్తి తీరుస్తున్నాయి. హైదరాబాద్ నగరాన్ని నిజాం ఎకనామిక్ జోన్‌గా తీర్చిదిద్దారు. పాలకులు మారినా నగర అభివృద్ధి ఆగలేదుం. అలాంటి నగరాన్ని కాపాడుకోవడం మనకర్తవ్యం.

1994 నుంచి ఇప్పటివరకు పరిపాలనలో విధా న నిర్ణయాల్లో వెనుకబడటం ఎప్పుడూ లేదు. పదేళ్లు రాష్ట్రాన్ని పరిపాలించిన వాళ్లు ఎందుకు మూసీ ప్రక్షాళన అడ్డుకుంటున్నారు? వారసత్వ సంపద కలిగిన ఈ నగరాన్ని ఇలాగే వదిలేద్దామా? మూసీ పునరుజ్జీవం జరిగితే కాంగ్రెస్‌కు, రేవంత్‌రెడ్డికి మంచి పేరు వస్తుందని, ఇక వాళ్లకు అధికారం కలగా మిగిలిపోతుందనే అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. దార్శనికతతో అభివృద్ధి ప్రణాళికలు రచించి అభివృద్ధి చేసిన వారే చరిత్రలో గుర్తుంటారు..'అని అన్నారు.

సంగమంలో మహాత్ముడి అస్తికలు..: 'మూసా, ఈసా నదుల సంగమం వద్ద ఆనాడు మహాత్మాగాంధీ అస్థికలు కలిపారు. అంతటి చరిత్ర బాపూఘాట్‌కు ఉంది. కానీ బాపూఘాట్‌ను ఎవరైనా సందర్శిస్తున్నారా? ఎందుకది మరుగున పడిపోయింది? ప్రస్తుతం ఈ నదులు పూర్తిగా కాలుష్యంతో విషతుల్యంగా మారాయి. ఈ నీరుతో నల్లగొండ ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారు. విషతుల్యమైన నీరు కారణంగా మహిళలు గర్భవతులు కూడా కావడం లేదు. ఇది కేవలం మూసీ పునరుజ్జీవనం మాత్రమే కాదు. మన సంస్కృతిని, చరిత్రను కాపాడుకోవడం. అందులో భాగంగానే నల్ల చెరువు, బతుకమ్మ కుంట బమ్రుక్ ఉద్దౌలా వంటి చెరువులను పునరుద్ధరించాం.

**అడ్డుకుంటున్న వాళ్లు అక్కడ ఉండగలరా?**

ఇవాళ మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకుంటున్నవారు మూసీ పరీవాహకంలో నివసించగలరా? వాళ్లు ఉంటానంటే అన్ని సౌకర్యాలతో కంటైనర్ హౌస్ ఇస్తా. మూడు నెలలు అక్కడ ఉండగలరా? ఎందుకు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. పేదలకు సరైన మౌలిక వసతులు కల్పించొద్దా? బ్లూ కాలర్ జాబ్స్ క్రియేట్ చేయొద్దా? పర్యాటక అభివృద్ధి జరగొద్దా? నైట్ ఎకానమీ అభివృద్ధి చెందొద్దా? అభివృద్ధిని అడ్డుకుని ఇంకా వెనక్కి రాతి యుగాల వైపు వెళ్ళిపోదామా? ఓఆర్ఆర్ నిర్మాణం జరిగినపుడు కూడా కొందరు భూములు కోల్పోయారు. ఇప్పుడు మూసీ పునరుజ్జీవనంతో రాష్ట్రం గ్రోత్ ఇంజన్‌గా మారుతుంది.

మూసీ బాధితులకు ఎలాంటి పరిహారం ఇద్దామో చెప్పండి. దానిని అమలు చేద్దాం. మీ సలహాలు సూచనలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. అందరి సహకారంతో ఈ ప్రాజెక్టును పూర్తి చేసుకుందాం..'అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ సలహాదారులు, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గ్యాస్ కొరత లేదు




**కేంద్రప్రభుత్వం స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ, మార్చి 13 (ప్రభాత ఉదయం):**

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఎల్‌పీజీ కొరత ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో కేంద్రం కీలక ప్రకటన చేసింది. ఎలాంటి భయాందోళనలు వద్దని, 'ప్యానిక్ బుకింగ్' అవసరం లేదని తెలిపింది. సంక్షోభం లేదని వివరించింది. గృహావసరాల కోసం ఎలాంటి అంతరాయం లేకుండా పైపుల ద్వారా సహజ వాయివు , కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ సరఫరాకు భరోసా ఇచ్చింది. పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ శుక్రవారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ, ఆసుపత్రులు, హాస్టల్స్‌కు ఎల్‌పీజీ సరఫరాకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. మార్చి 2026తో పోల్చుకుంటే దేశంలో ఎల్‌పీజీ ఉత్పత్తి 40 శాతం పెరిగిందని, అదనంగా రాష్ట్రాలకు 48,000 కిలోలీటర్ల (సుమారు 48 మిలియన్ లీటర్లు) కిరోసిన్ పంపిణీ చేశామని తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్లకు బొగ్గు సరఫరా చేయాలని కోల్ ఇండియాను ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. మధ్యప్రాచ్యంలో యుద్ధానికి ముందు యావరేజ్‌గా 55.7 లక్షల బుకింగ్‌లు ఉంటే మార్చి 12 నాటికి అది 75.7 లక్షలకు పెరిగిందని, భయాల కారణంగానే బుకింగ్‌లు అనూహ్యంగా పెరిగాయని సుజాతా శర్మ తెలిపారు. ఎల్పీజీపై ఒత్తిడి తగ్గేందుకు పీఎన్‌జీ కనెక్షన్లకు మళ్లాలని ప్రజలను కోరారు. క్రూడాయిల్‌కు సంబంధించి 258 మిలియన్ మెట్రిక్ టన్నుల కపాసిటీ మనకు ఉందని, పెట్రోల్, డీజిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని కలిగి ఉన్నామని వివరించారు. ప్రధానమైన అర్బన్ సిటీలు, కేంద్రాల్లో కమర్షియల్ వినియోగదారుల ఆందోళన, సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని చెప్పారు. కమర్షియల్ వినియోగదారులు స్థానిక సీజీడీ (సిటీ గ్యాస్ డిస్టిబ్యూషన్) నెట్‌వర్క్ ప్రొవైడర్‌ను కానీ, సంబంధిత డీలర్‌ను కానీ సంప్రదించి పీఎన్‌జీ కనెక్షన్ పొందవచ్చని సూచించారు. దేశంలోని అన్ని పెట్రోల్ పంపుల్లో తగినన్ని పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని, బంకులు ఖాళీ అయినట్టు 25,000 డిస్టిబ్యూటర్లలో ఏ ఒక్కరి నుంచీ తమకు సమాచారం లేదని సుజాతా శర్మ తెలిపారు. వదంతులను విశ్వసించవద్దని, ప్యానిక్ బైయింగ్‌కు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# టెహ్రాన్‌లో భారీ పేలుడు

**న్యూఢిల్లీ, మార్చి 13 (ప్రభాత ఉదయం):**

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు చోటుచేసుకుంది. పాలస్తీనాకు మద్దతుగా భారీ ఎత్తున నిర్వహిస్తున్న 'కుద్స్ డే' ర్యాలీలో ఊహించని విధంగా తీవ్ర విస్ఫోటనం సంభవించింది. ఇజ్రాయెల్ సైన్యం బహిరంగంగా హెచ్చరికలు జారీ చేసిన కొద్దిసేపటికే ఈ ఘటన జరగడం గమనార్హం.దాడికి ముందు ఇజ్రాయెల్ సైన్యం తమ అధికారిక పెర్షియన్ (ఫార్సీ) సోషల్ మీడియా ఖాతా ద్వారా మూడు మ్యాప్‌లను పంచుకుంది. టెహ్రాన్‌లోని చహర్రా-ఇ వెలియాస్, మేయ్దాన్-ఇ తౌహిద్, విల్లాస్ ప్రాంతాలను ఎరుపు రంగుతో మార్క్ చేసింది.



ఈ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు వెంటనే సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని, త్వరలోనే దాడులు జరుగుతాయని చాలా స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది. ఈ హెచ్చరికలు వెలువడిన కొద్ది సమయానికే, టెహ్రాన్ యూనివర్సిటీ వైపు వెళుతున్న కుద్స్ డే ర్యాలీ సమీపంలో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. పవిత్ర రంజాన్ మాసం చివరి శుక్రవారం సందర్భంగా పాలస్తీనాతో సంఘీభావం తెలుపుతూ ఇరాన్ ప్రజలు ఈ నిరసనలు చేపడుతుంటారు. పేలుడు దెబ్బకు ఆకాశంలోకి దట్టమైన పొగలు ఎగిసిపడటంతో జనం ప్రాణభయంతో పరుగులు తీశారు. ప్రస్తుతం ఈ ఘటనలో ఎంతమంది ప్రాణాలు కోల్పోయారు, ఎంతమంది గాయపడ్డారు అనే దానిపై ఇరాన్ ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సంఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో.. ఇజ్రాయెల్ ముందస్తు హెచ్చరికలు చేసిన వెంటనే ఈ పేలుడు జరగడం పశ్చిమాసియాలో మరింత ఆందోళనను రేకెత్తిస్తోంది.

### ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ

# హెచ్‌జే దొర కన్నుమూత

**మొదటి పేజీ తరువాయి...**

తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు నిమ్స్ కు తరలించారు. అత్యవసర చికిత్స అందించినప్పటికీ డాక్టర్ల ప్రయత్నాలు ఫలించలేదు. 1965 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన హెచ్‌జే దొర శ్రీకాకుళం జిల్లాకు చెందినవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డీజీపీగా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఆయన విశేష సేవలు అందించారు. ముఖ్యంగా, రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాదాన్ని (నక్సలిజం) అణచివేయడంలో కీలక పాత్ర పోషించి గుర్తింపు పొందారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్‌గా, సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్‌గానూ జాతీయ స్థాయిలో పలు ఉన్నత పదవులు చేపట్టారు. దొర 1996లో డీజీపీగా ప్రమోషన్ పొందారు. ఆయన తన సుదీర్ఘ వృత్తి జీవితానుభవాలతో 'జర్నీ త్రూ టర్బ్యులెంట్ టైమ్స్' పేరుతో ఆత్మకథను కూడా రచించారు.

# నేటినుంచి పదో తరగతి పరీక్షలు

**మొదటి పేజీ తరువాయి...**

5,17,727మంది రెగ్యులర్, ఒకసారి ఫెయిలైన 10,512మంది విద్యార్థులు ఉన్నారు. ఈసారి ప్రైవేటు పాఠశాల నుంచి అత్యధికంగా 2,50,015 విద్యార్థులుండగా, ప్రభుత్వ బడుల నుంచి 2,07,573 మంది, సంక్షేమ గురుకులాల నుంచి 60,139 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 1,582 ప్రభుత్వ, 1,094 ప్రైవేటు విద్యాసంస్థలు ఉన్నాయి. హాల్ టికెట్లు ఇప్పటికే అన్ని పాఠశాలకు పంపించామని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తెలిపారు. పాఠశాల గుర్తింపు తెలియకుండా సాధారణ దుస్తుల్లోనే విద్యార్థులు పరీక్షకు రావాలని కోరారు. పరీక్షల పర్యవేక్షణకు 144 ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటుచేశామన్నారు. పరీక్షలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30వరకు ఉంటాయి. పదవ తరగతి పరీక్షల సమయం సమీపిస్తున్న కొద్ది విద్యార్థుల్లో ఒత్తిడి మొదలవుతుంది. ఒత్తిడిని జయించడానికి విద్యార్థులు ఏకాగ్రతతో ప్రణాళికబద్ధంగా చదివితే మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతారని నిపుణులు సూచిస్తున్నారు. ఇతర ఆలోచనలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పరీక్షల సమయంలో సెల్‌ఫోన్, టీవీ వైపు మనస్సు మరలకుండా చూసుకోవాలి. ప్రతిరోజూ విద్యార్థి ఏర్పాటు చేసుకున్న టైం టేబుల్ ప్రకారం చదువు కోవాల్సి ఉంటుంది. సందేహాలను విద్యార్థులు ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలి.



# మూసీ నీటితో రైతులకు మేలు జరిగితే స్వాగతిస్తాం

**మొదటి పేజీ తరువాయి...**

కీలక సూచన చేశారు. ఒకప్పుడు సబర్మతి సైతం మూసీలా కాలుష్యంతో, దుర్వాసనతో ఉండేదని గుర్తుచేశారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత.. నర్మదా నది నుంచి నీటిని సబర్మతికి మళ్లించి, నదుల అనుసంధానం చేయడం ద్వారా ఆ నదిని శుభ్రపరిచారని చెప్పారు. అక్కడ నివసిస్తున్న పేద కుటుంబాలను ముందుగా పునరావాసం కల్పించి.. ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టు చేపట్టారని గుర్తు చేశారు. సుమారు 4 వేల కుటుంబాలకు ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే అభివృద్ధి పనులు చేపట్టారని, ప్రజల జీవితం దెబ్బతినకుండా జరిగేదే నిజమైన అభివృద్ధి అని పేర్కొన్నారు. మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలను నిరాశ్రయులను చేయడాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అభివృద్ధి పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లు కూల్చడం అన్యాయమన్నారు. గాంధీ సరోవర్ కోసం భూమి అవసరమైతే ప్రాజెక్టును రియలైన్ చేసుకోవచ్చని సూచించారు. ఒక్క ఇల్లు కూడా దెబ్బతినకుండా ప్రణాళిక రూపొందించాలన్నారు. గాంధీ విగ్రహం నిర్మించాలనుకుంటే వెయ్యి అడుగులైనా, రెండువేల అడుగులైనా ఆకాశాన్ని తాకేలా నిర్మించొచ్చని, దానికి బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. కానీ పేదల ఇళ్లు కూల్చి వారి జీవనాధారాన్ని దెబ్బతీస్తే మాత్రం బీజేపీ తప్పకుండా వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు. ముందుగా మూసీని శుద్ధిచేసి, ఆ తర్వాత అభివృద్ధి పనులు చేపట్టాలని, దానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. దేశంలో గ్యాస్, ఆయిల్, డీజిల్, పెట్రోల్ దొరకవని ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం పూర్తిగా బాధ్యతారాహిత్యమని అన్నారు. రాహుల్ గాంధీ వంటి కాంగ్రెస్ నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ప్రపంచంలో యుద్ధాలు, ఉద్రిక్తతలు ఉన్నప్పుడు వాటి ప్రభావం ప్రపంచవ్యాప్తంగా, భారతదేశంపైనా కనిపించవచ్చని, కానీ అదే పేరుతో దేశంలో కొరత వస్తుందని భయాందోళనలు సృష్టించడం సరికాదన్నారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్, ప్రధాని నరేంద్ర మోదీ.. సంబంధిత దేశాల నాయకులతో మాట్లాడి, భారతదేశానికి రావాల్సిన చమురు, గ్యాస్ సరఫరా హోర్ముజ్ జలసంధి ద్వారా అంతరాయం లేకుండా దేశానికి చేరేలా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. భారతదేశం ఒకే ప్రాంతంపై ఆధారపడదని, దాదాపు 40 శాతం ముడి చమురు ఇతర దేశాల నుంచీ వస్తోందని చెప్పారు. అందువల్ల దేశంలో గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్, డీజిల్ కొరత ఉండదన్నారు. యుద్ధ పరిస్థితుల వల్ల రవాణాలో స్వల్ప ఆలస్యాలు ఉండొచ్చని.. కానీ ఇంధన కొరత మాత్రం ఉండదని స్పష్టం చేశారు. ప్రపంచంలో ఎలాంటి పరిస్థితులు వచ్చినా భారత ప్రజలు వాటిని ఎదుర్కొనే శక్తి కలిగిన వారని చెప్పారు. అలాంటి సమయంలో నాయకులు.. ప్రజల్లో ధైర్యం నింపాల్సిందే తప్ప, భయాందోళనలు కలిగించడం పెద్ద తప్పు అని పేర్కొన్నారు. దేశంలో గృహ వినియోగ ఎల్‌పీజీ, గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరత ఉండదని ప్రధాని ఇప్పటికే స్పష్టం చేశారని గుర్తు చేశారు. సాధారణ ప్రజలకు ఇంధన సరఫరా నిరంతరం కొనసాగుతుందని కేంద్ర ప్రభుత్వం సైతం హామీ ఇచ్చిందన్నారు. అందువల్ల వాస్తవాలు తెలుసుకోకుండా ప్రజల్లో భయాందోళనలు కలిగించే వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ రాంచందర్ రావు తెలిపారు.



# రాజ్యాంగ రక్షణ అంటే ఫిరాయింపులను ప్రోత్సహించడమా

**మొదటి పేజీ తరువాయి...**

అన్నారు. కానీ తెలంగాణలో రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతోందని అన్నారు. ఫిరాయింపులను ప్రోత్సహించడమే రాజ్యాంగాన్ని రక్షించడమా అని ఎద్దేవా చేశారు. ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అవకాశవాదం కోసం ఉపయోగించుకుంటున్నారని మండిపడ్డారు.

# నిజామాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**మొదటి పేజీ తరువాయి...**

నలుగురు మృతిచెందగా.. పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. హుటాహుటిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... టూరిస్ట్ బస్సు వేగంగా ప్రయాణిస్తుండగా.. డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడం తో బస్సు ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ప్రమాదం గన్నారం గ్రామ శివారులోని బ్రహ్మంగారి ఆలయం దగ్గర చోటుచేసుకుంది. ఈ ఘటన జరిగిన సమయంలో బస్సులో 36 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ బస్సు హైదరాబాద్ నుంచి నాగ్‌పుర్ వెళ్తుంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు గాయపడిన వారిని బయటకు తీసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులకు, అత్యవసర సేవలకు సమాచారం అందించారు. ఈ ప్రమాదంలో నలుగురు ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. బస్సు బోల్తా పడిన సమయంలో తీవ్ర గాయాల కారణంగా వారు మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతుల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఈ ఘటనతో మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ప్రమాదంలో పలువురు ప్రయాణికులు గాయపడగా వారిని స్థానికుల సహాయంతో సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ఇతర పెద్ద ఆస్పత్రులకు తరలించినట్లు సమాచారం. వైద్యులు గాయపడిన వారికి చికిత్స అందిస్తున్నారు. బస్సులో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు రెస్క్యూ బృందాలు శ్రమించాయి. ఈ ఘటనతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ జాం అయింది. అనంతరం ట్రాఫిక్‌ను క్లియర్ చేసి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. డ్రైవర్ నిర్లక్ష్యం, ఇతర సాంకేతిక కారణాల వల్ల ప్రమాదం జరిగిందా అనే కోణంలో విచారణ చేస్తున్నారు.

# వ్యవసాయ వర్సిటీ పీజీ, పీహెచ్ విద్యార్థుల స్టైఫండ్ పెంచాలంటు అకాడమి బ్లాక్ పైకి ఎక్కి నిరసన తెలిపిన విద్యార్థులు

## వీసీ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య హామీతో దీక్ష విరమణ




స్టైఫండ్ పెంచాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు మద్దతు ప్రకటిస్తున్న తెలంగాణ సామాజిక విద్యార్థి సంఘం అధ్యక్షుడు మీసాల లక్ష్మి నివాస్



విద్యార్థులతో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం గోవర్ధన్



అకాడమిక్ బ్లాక్ పైకి ఎక్కి నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు రాజ్ కుమార్, మనోజ్ గౌడ్, లోకేష్ లు

**బుద్వేల్, మార్చి 13 (ప్రభాత ఉదయం)**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం లో పీజీ, పీహెచ్ డీ చదువుతున్న విద్యార్థులకు నెల నెల ఇచ్చే స్టైఫండ్ ను పెంచుతు 2025 ఆగస్టు లో వర్సిటీ ఇచ్చిన సర్క్యులర్ ను అమలు చేయాలని డిమాండ్ చేస్తు గురువారం నుంచి ఆమరణ నిరాహార దీక్షకు దిగిన విద్యార్థులు శుక్రవారం అకాడమిక్ బ్లాక్ పైకి ఎక్కి నిరసన కు దిగారు. ఆమరణ నిరాహార దీక్షలో ఉన్న రాజ్కుమార్, మనోజ్ గౌడ్, లోకేశ్ లు ఉదయం 11 గంటలకు అకాడమిక్ బ్లాక్ ఎక్కి తమ డిమాండ్ల పరిష్కారం కోసం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వెంటనే స్పందించి హామీ ఇవ్వాలని కోరారు. ఒంటిపై పెట్రోల్ పోసుకున్నారు. అకాడమిక్ బ్లాక్ పైకి ఎక్కిన విద్యార్థులకు మద్దతుగా క్రింద ఉన్న విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాధాలు చేస్తు నిరసన లో పాల్గొన్నారు. వారికి నచ్చ చెప్పడానికి వర్సిటీ డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ఎంత ప్రయత్నించిన విద్యార్థులు ఒప్పుకోలేదు. 2025లో పీజీ విద్యార్థుల స్టైఫండ్ ను రూ.5వేల నుంచి రూ.12 వేలకు, పీహెచ్ విద్యార్థుల స్టైఫండ్ ను రూ. 7వేల నుంచి రూ.15 వేలకు పెంచుతామని విశ్వవిద్యాలయం జారీ చేసిన సర్క్యులర్ ను అమలు చేస్తు నిర్ణయం తీసుకునే వరకు తమ నిరసనను కొనసాగిస్తునే ఉంటామని పట్టుబట్టారు. విద్యార్థుల నిరసన ప్రాంగణానికి ఫైరింజన్ తో పాటు హైడ్రా సిబ్బంది చేరుకుని వారికి ఎలాంటి ఇబ్బందులు కలిగిన ఆదుకోనేందుకు అప్రమత్తంగా ఉన్నారు. నిరసన కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు మౌనిక, సౌజన్య, రామక్రిష్ణ, అజయ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

**అసెంబ్లీ లో ప్రస్తావిస్తామన్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్:**

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పీజీ, పీహెచ్ డీ చదువుతున్న విద్యార్థులు స్టైఫండ్ పెంచాలని చేపట్టిన నిరసన లకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు, వర్సిటీ పూర్వ విద్యార్థి డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ మద్దతు ప్రకటించారు. శుక్రవారం ఆయన కళాశాలకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం విషయాన్ని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన అసెంబ్లీలో విద్యార్థుల స్టైఫండ్ విషయమై మాట్లాడతానని ఫోన్ ద్వారా విద్యార్థులకు వినిపించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల డిమాండ్ న్యాయమైనదేనన్నారు. వ్యవసాయ వర్సిటీ యాజమాన్యం స్టైఫండ్ పెంచుతామన్నా ప్రభుత్వం ఎందుకు అంగీకరించడం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యమంత్రి జీతాలు తగ్గించుకోనైన విద్యార్థుల స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేశారు. పేద వర్గాలు ఉన్నత విద్యను అభ్యసించకూడదన్న కుట్రలో భాగమే విద్యార్థులకు స్టైఫండ్ పెం చడం లేదని డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు.




విద్యార్థుల కు సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న బి ఆర్ ఎస్ నాయకులు డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్



విద్యార్థులకు జ్యూస్ ఇచ్చి దీక్షలు విరమింప చేస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య

**పలువురి సంఘీభావం :**

స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేస్తు అకాడమిక్ బ్లాక్ పైకి ఎక్కిన విద్యార్థుల విషయాన్ని తెలుసుకున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం నాయకులు పృథ్వీ, రాజు, ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం నాయకులు నాగులపల్లి సంగారెడ్డి, తెలంగాణ సోషల్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు మీసాల లక్ష్మి నివాస్, ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కె.వై. ప్రణయ్, సీపీఎం నాయకులు జె రుద్రకుమార్, ఎస్ రామ్మోహన్ రావు, జీ గట్టయ్య, బాస్కర్, చుక్క మోహన్. తరుణ్, తనిష్, కౌశిక్ తదితరులు వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చేరుకుని విద్యార్థులకు సంఘీభావం తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పీజీ, పీహెచ్డీ విద్యార్థులకు సైఫండ్ పెంచాల్సిందేనని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థులు చదువుకోకుండ కుట్ర పన్నుతున్నదని, అందులో బాగంగానే వారికి రావాల్సిన స్టైఫండ్ పెంచే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు.ఈ నెల 16 నాటికి ఓ నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం చెప్పింది వీసీ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యస్టైఫండ్ పెంచాలంటు నిరసనకు దిగిన విద్యార్థుల వద్ద కు శుక్రవారం సాయంత్రం వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వచ్చి వారికి నచ్చచెప్పారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పీజీ, పీహెచ్ డీ చదువుతున్న విద్యార్థుల స్టైఫండ్ పెంపు విషయం పై శు క్రవారం వ్యవసాయ శాఖ కార్యదర్శి తో చర్చించడం జరిగిందన్నారు. ఫైల్ సచివాలయం లో ఉందని, ఈ నెల 16లోగా సైఫండ్ పెంచే ఆలోచన లో ప్రభుత్వం ఉందని వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య విద్యార్థులకు చెప్పారు. దీంతో విద్యార్థులు నిరసనను ఉప సంహరించారు.

## మహువా నుంచి విలువైన ఉత్పత్తులు

**బుద్వేల్, మార్చి 13 (ప్రభాత ఉదయం)**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఫుడ్స్ అండ్ న్యూట్రీషన్ విభాగం, కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ ఆధ్వర్యలో మహువా (ఇప్ప పువ్వు) తో వివిధ విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మార్చి 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివరాలను కమ్యూనిటీ సైన్స్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి విజయలక్ష్మీ వివరించారు. సాదారణంగా మహువా మధ్యం తయారీలోనే ఉపయోగిస్తారని అం దరికి తెలుసు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉ పయోగించి మహువా నుంచి అనేక ఇతర విలువైన ఉత్పత్తులను తయారు చేసే పద్దతులను పరిచయం చేయడానికి ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుంచి 20 మంది మహిళలు, పురుషులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని భారత ప్రభుత్వం శాస్త్ర సాంకేతిక విభాగం, ఎస్సీ ఎస్టీ సెల్, సైన్స్ ఫర్ ఈక్విటీ ఎంపవర్మెంట్ అండ్ డెవలప్మెంట్(సీడ్) డివిజన్ ఆర్థిక సహయంతో నిర్వహించారు. ఇప్ప పువ్వుతో బిస్కట్, కేక్, చాక్లెట్, మురుకు, న్యూట్రీబార్, ఆర్ ఎస్ పానీయాల తయారీ గురించి శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ కె వి రమణారావు, డాక్టర్ బి అనిల కుమారి, డాక్టర్ టి కమలజ, పృథ్వీరాజ్ లు పాల్గొన్నారు.




శిక్షణ లో పాల్గొన్న గ్రామీణ రైతులు

# ఘనంగా హైదర్ షా కోట్ మాజీ సర్పంచ్ పూలపల్లి కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు

## కృష్ణారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు



మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న సీనియర్ నాయకులు బల్వంత్ రెడ్డి ..




కృష్ణారెడ్డి జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరంలో రక్తం దానం చేస్తున్న యువకులు

**బండ్లగూడ, మార్చి 13(ప్రభాత ఉదయం)**

జిహెచ్ఎంసి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్ షాకోట్ మాజీ సర్పంచ్ పూలపల్లి కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కృష్ణారెడ్డి జన్మదినం సందర్భంగా హైదర్ షా కోట్ డివిజన్ పరిధిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పార్టీ శ్రేణులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ... ప్రజా జీవితంలో ఎంతో సంతృప్తినిస్తుందని అందుకోసం తాను నిరంతరం ప్రజల కోసం, కాంగ్రెస్ పార్టీ కోసం కృషి చేస్తూ ముందుకు వెళుతున్నాను అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి పథంలో ముందుకు వెళుతుందని ప్రభుత్వ ఆశయాలు, ప్రజల సంక్షేమ పథకాలను ప్రజల ముందుకు తీసుకెళ్తూ ప్రజాహితమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. గ్రామ మాజీ ఉపసర్పంచ్ లక్ష్మణ్, మాజీ వార్డు సభ్యులు శ్రీను, సీనియర్ నాయకులు చింతలపల్లి బల్వంత్ రెడ్డి, పార్టీ నాయకులు శంకర్, కుమార్ తదితరులు కృష్ణారెడ్డికి కేకు తినిపించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.




రాజేంద్రనగర్ లోని ఐ ఐ ఎం ఆర్ ను సందర్శించిన ఐ సీ ఏ ఆర్ అధికార భాష విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ లు

## ఐఐఎంఆర్‌ను సందర్శించిన ఐసీఏఆర్ అధికార భాష విభాగం అసిస్టెంట్ డైరెక్టర్‌లు

**బుద్వేల్, మార్చి 13 (ప్రభాత ఉదయం):**

భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) అధికార భాష విభాగంలో అసిస్టెంట్ డైరెక్టర్ లుగా ఉద్యోగం పొంది రాజేంద్రనగర్ లో శిక్షణ పొందుతున్న 17 మం ది అధికారుల బృందం శుక్రవారం రాజేంద్రనగర్ లోని జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ (ఐఐఎం ఆర్) ను సందర్శించింది. వారికి ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి పర్యవేక్షణలో న్యూట్రీ హబ్ సీఈఓ డాక్టర్ జె స్టాన్లీ, అంకిత ఉ పాధ్యాయ్ లు చిరుధాన్యాల ఉత్పత్తులతో తయారు చేస్తున్న ఆహార పదార్థాలు, మార్కెటింగ్ సౌకర్యాలు, వాటి వల్ల కలిగే ఉపయోగాల గురించి వివరించారు. నార్మ్ అధికార భాష జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జె రేణుక ఈ బృందానికి సారథ్యం వహించారు. ఐఐఎంఆర్ అధికార భాష విభాగం అసిస్టెంట్ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ మహేష్ కుమార్ ఐసీఏఆర్ అధికార భాష విభాగానికి చెందిన అధికారులకు ఐఐఎంఆర్ లో అమలౌతున్న అధికార భాష గురించి వివరించారు.



## నేడు హిమాయత్ సాగర్‌లో విద్యుత్ సరఫరాల అంతరాయం

**బండ్లగూడ, మార్చి 13(ప్రభాత ఉదయం)**

హిమాయత్‌సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను నరికివేత, వార్షిక సబ్-స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం శనివారం ఫీడర్లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ రమేష్ తెలిపారు. ఈ సెక్షన్ పరిధిలో మధ్యాహ్నం 14:00 గంటల నుండి. నుండి 15:00 గంటల వరకు రిచ్‌మండ్ విల్లాస్ ఫీడర్ కీర్తి రిచ్‌మండ్ విల్లాస్, పి అండ్ టి కాలనీలో భాగం ఏ బి సి డి ప్రత్యేక బ్లాక్‌లు, హైదర్‌షాకోట్ ఫీడర్ వెంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రస్తా నగర్, తిరుమల గార్డెన్, రాధ రీట్‌పర్స్ ఫేజ్-××, పావని హార్మోనీ విల్లాస్, బచ్‌పన్ స్కూల్, పాఠశాల, పాఠశాల, సన్ సిటీఫీడర్ ప్రభావిత ప్రాంతాలు: హిమగిరినగర్, గంధంగూడ, వెస్ట్ ఎండ్ కాలనీ, శాంతి నగర్, లక్ష్మీ నగర్, హైదర్‌షాకోట్ విలేజ్ మొదలైనవి., ,16:00 నుండి 17:00 గంటల వరకు పీరంచెరు ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన షాదన్ మెడికల్ కాలేజ్, షాదన్ ఇంజనీరింగ్ క్యాంపస్, పీరంచేరు విలేజ్, వసతి ఆనంది అపార్ట్‌మెంట్లు, గిరిధారి అపార్ట్‌మెంట్లు, ఎంపైర్ ఇన్‌సిగ్నియా విల్లాస్ మొదలైనవి., పి అండ్ టి కాలనీ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన అక్బర్ కాలనీ, సబితా ఇంద్రా రెడ్డి నగర్, పీరంచేరు పాత గ్రామం ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.




## అపరిశుభ్రమైన వాతావరణంలో అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్న రెండు స్థావరాలపై దాడి, ఇద్దరి అరెస్ట్

**బుద్వేల్, మార్చి 13 (ప్రభాత ఉదయం)**




నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

శాస్త్రీపురం బాబా కాంట వద్ద, ఉ డంగడ్డ రైల్వే ట్రాక్ పక్కన అపరిశుభ్రమైన ప్రదేశంలో కల్తీ పదార్థాలతో అల్లం వెల్లుల్లి పేస్ట్ ను తయారు చేస్తున్న ఇద్దరు వ్యకు లను మైలార్దేవుపల్లి పోలీసులు శు క్రవారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. ఈ వివరాలను రాజేం ద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలియజేశారు. శాస్త్రీపురం బాబా కాంట వద్ద మీరాలం ఈద్గా ప్రాంత నివాసి, స్టాండర్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ నిర్వాహకులు అబ్దుల్ అలీమ్ (25), అబిడ్స్ చిరాగ్ అలీ లేన్ గోల్కొండ హోమ్ లో నివాసం ఉంటు ఉడంగడ్డ రైల్వే ట్రాక్ వద్ద అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్న జసాని దిల్ దార్ అలీ (46) లను అరెస్ట్ చేశారు. వారి నుంచి 1800 కిలో నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్, వాటిలో ఉపయోగించే కెమికల్స్ ను, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

# ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి కుమారుడు సాయి సాకేత్ రెడ్డి వివాహ వేడుకలు

### హాజరుకానున్న సీఎం రేవంత్ రెడ్డి.. నేడు జరగనున్న వివాహ వేడుకలకు పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు

### సీఎం భద్రత ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, కలెక్టర్ శ్రీనివాస్ రావు



సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్న సందర్భంగా ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్ పి లతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి



వివాహ వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, ఎస్ పి శ్రీనివాసరావు

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి13(ప్రభాత ఉదయం)**

గద్వాల అసెంబ్లీ నియోజకవర్గం శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కుమారుడు సాయి సాకేత్ రెడ్డి వివాహం ఐశ్వర్య రెడ్డి తో జరగనున్న వేడుకలకు సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. శుక్రవారం సీఎం

రేవంత్ రెడ్డి గద్వాలలో పర్యటిస్తున్న సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. శనివారం గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సాయి సాకేత్ రెడ్డి వివాహానికి హాజరయ్యేందుకు సీఎం రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు గద్వాలకు వస్తున్న నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ వెనుక ఉన్న హెలిప్యాడ్ వద్ద ఎస్పి శ్రీనివాసరావు తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం కళ్యాణ వేదిక వద్దకు కలెక్టర్ చేరుకుని సీఎం పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు



సాయి సాకేత్ రెడ్డి ని పెళ్లి కొడుకు ను చేస్తున్న మేనమామలు వెంకటేశ్వర్ రెడ్డి, గోపాల్ రెడ్డి కుటుంబ సభ్యులు.

తలెత్తకుండా చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి వివాహ వేదిక వద్ద సీఎం పర్యటనకు చేసిన ఏర్పాట్ల గురించి కలెక్టర్ కు వివరించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, ఆర్ అండ్ బి ఈఈ ప్రగతి, డిఎస్పి మొగిలయ్య, పలువురు అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా పెళ్లి కొడుకు వేడుకలు**

ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, జ్యోతి దంపతులకు కుమారుడు సాయి సాకేత్ రెడ్డి వివాహం సందర్భంగా శుక్రవారం పెళ్ళికొడుకు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. శుభకార్యానికి కుటుంబ సభ్యులు, బంధువులు, నియోజకవర్గ నాయకులు హాజరయ్యారు.



ప్రజా పాలన లో సిపిఎం కౌన్సిలర్ బూడిద జ్యోతి గోపి

## ప్రజలు ఇళ్ల మధ్యల ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం వెయ్యవద్దు

### బూడిది జ్యోతి గోపి మూడో వార్డ్ కౌన్సిలర్

### 7వ రోజు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పారిశుద్ధ కార్యక్రమం

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 13(ప్రభాత ఉదయం):**

జనగామ మున్సిపాలిటీ లోని మూడవ వార్డు లో గజ్జల సంజీవరెడ్డి, ఎల్లమ్మ టెంపుల్ ఏరియా, ఎల్ఐసి సాంబశివరావు ఇంటి ఏరియా, జిఎంఆర్ కాలనీ లో రోడ్లపైన, మోరీల పైన ఉన్న పిచ్చి మొక్కలు గడ్డి తొలగింపు కార్యక్రమం శుక్రవారం బూడిది జ్యోతి మూడో వార్డ్ కౌన్సిలర్ పర్యవేక్షణలో ముమ్మరంగా జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ జ్యోతి మాట్లాడుతూ ప్రజలు ఖాళీ ప్లాట్ లలో ఇళ్ల మధ్యల ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం వేయవద్దని, మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలని వ్యక్తిగతమైనటువంటి పరిశుభ్రతతో పాటు మన పరిసరాల పరిశుభ్రత కూడా మనందరి బాధ్యత అన్నారు. వార్డు ప్రజలు సహకరించాలని మన వార్డు అందరి సహకారం ఉంటేనే మోడల్ కాలనీగా అభివృద్ధి చేసుకోవచ్చని ప్రజలకు వివరించారు. ఈకార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, సీనియర్ నాయకులు కొమ్మ గళ్ళ ఎల్లయ్య, కాంగ్రెస్ వార్డు అధ్యక్షులు మచ్చ ప్రవీణ్ కుమార్, సోనబోయిన కుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు కొలుపుల భాస్కర్, సిపిఎం శాఖ సెక్రెటరీ గుండు శశిరేఖ, సిపిఎం నాయకులు బూడిది రవీందర్, మలిపెల వాణి, కోయల్ కార్ స్వప్న, బిట్ల ఎల్లమ్మ, దేవాలయ నిర్వాహకురాలు పద్మావతి, వార్డు ఆఫీసర్ నిఖిల్ రెడ్డి, జవాన్ ఎల్లయ్య, దుంబాల రేవతి, మోటే సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.



## పని చేస్తేనే శ్రమ విలువ తెలుస్తుంది

### ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. మీనాక్షి

**గద్వాల,మార్చి 13(ప్రభాత ఉదయం)**

గద్వాలలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక వేసవి శిబిరం శుక్రవారంతో విజయవంతంగా ముగిసింది. వెంకంపేట గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిక్షణ శిభిరానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.మీనాక్షి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ "పని చేస్తేనే శ్రమ విలువ తెలుస్తుంది అని, విద్యార్థులు సేవా కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా విద్యార్థులలో సామాజిక బాధ్యత, క్రమశిక్షణ , సేవా భావం పెరుగుతాయి" అని తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చేసిన సేవలను ఆమె అభినందించారు. శిబిరం సందర్భంగా గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమాలు, మొక్కలు నాటడం, యాంటీ డ్రగ్స్ అవగాహన ర్యాలీ, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహించామని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి. జగన్ మోహన్ తెలిపారు.ముగింపు సందర్భంగా స్థానిక కౌన్సిలర్ ఎం. చిన్న రాములు, ప్రిన్సిపాల్ డాక్టర్ మీనాక్షి తో కలిసి కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో పాల్గొన్న వాలంటీర్లకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్ మాస్టర్ రమేష్, అధ్యాపకులు ఎం.దేవుజా, ఎం.సమత, ఎం.వనిత, గ్రామ యువకులు హరినాథ్ రెడ్డి, నరేష్ , మాజీ కౌన్సిలర్ రాంచంద్రయ్య పాల్గొన్నారు.





## త్రాగు నీటిని వృథా చేయకూడదని ప్రచారం చేసే అధికారులే... కార్లు కడగడానికి మంచి నీటిని వాడేస్తున్నారు

**గద్వాల, మార్చి 13 ( ప్రభాత ఉదయం)**

వేసవి కాలంలో త్రాగునీరు సంక్షోభం ఎదుర్కొంటున్న జోగులాంబ గద్వాల్ జిల్లాలో శుక్రవారం గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు తమ సొంత కార్లు కడగడానికి ప్రభుత్వ కార్యాలయాల్లోని మంచి నీటిని వృథా చేస్తున్నారు. "త్రాగే నీటిని వృథా చేయకండి" అని గ్రామాల్లో ప్రచారం చేస్తున్న అధికారులే ఈ వ్యవహారానికి పాల్పడడం పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.జిల్లా వ్యాప్తంగా చాలా గ్రామాల్లో వేసవి తీవ్రతతో త్రాగునీరు లభ్యం కాకుండా ప్రజలు నానా కష్టాలు పడుతున్నారు. త్రాగు నీటి కోసం గంటల తరబడి ప్రజలు వేచి ఉండాల్సి వస్తోంది. మహిళలు, పిల్లలు నీటి కోసం కాళ్లు వాచినా, అధికారులు మాత్రం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో తమ అధికారిక వాహనాలు, సొంత కార్లను కడుగడానికి మంచి నీటిని వాడేస్తున్నారు. "ప్రభుత్వం నీటి సంరక్షణకు కోట్లు ఖర్చు చేస్తుంటే, ఇక్కడ అధికారులు మాత్రం నీటిని కార్లు కడిగేందుకు వృథా చేస్తున్నారు. ఈ సంఘటన పై జిల్లా కలెక్టర్ మరియు ఉన్నతాధికారులు విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


## 15వేల రూపాయాలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన పంచాయతీ కార్యదర్శి

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి13(ప్రభాత ఉదయం)**





అయిజ మండలం ఎక్లాస్ పూర్ గ్రామ కార్యదర్శి బోయ రంగన్న రూ.15వేలు లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీకి చిక్కాడు. డీఎస్పీ బాలకృష్ణ వివరాల ప్రకారం.. ఎక్లాస్ పూరం గ్రామ పంచాయతీ పరిధిలోని ఉరుకుందు అనే ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులుడికి బిల్లు మంజూరు చేసేందుకు పంచాయతీ కార్యదర్శి రంగన్న రూ.20వేలు లంచం డిమాండ్ చేయగా రూ.15వేలు ఇస్తానని బాధితుడు ఒప్పందం కుదర్చుకున్నాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శి రంగన్నకు రూ.15వేలు ఇస్తుండగా అక్కడే మాటువేసిన ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం కేసు నమోదు చేశారు. బిల్లుల మంజూరు కోసం ప్రభుత్వ అధికారులు లంచం అడిగినా, అనుమతుల కోసం డబ్బులు డిమాండ్ చేసినా 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని డీఎస్పీ సూచించారు.



## పది పరీక్షలకు ముమ్మరంగా ఏర్పాట్లు

**కేటిదొడ్డి, మార్చి13(ప్రభాత ఉదయం)**

శనివారం నుంచి నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షల ఏర్పా ట్లపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పరీక్ష కేంద్రాలను తహసీల్దార్లు, ఎంఈ వోలు పరిశీలించారు. కేటిదొడ్డి మండలం నందిన్నె, పాతపాలెంలోని జెడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రాలను ఎంఈఓ విజయభాస్కర్ తో కలిసి తహసీల్దార్ కరుణాకర్ పరిశీలించారు.ఈ సందర్బంగా విద్యార్థులకు సరిపడా బెంచీలు, త్రాగునీరు, విద్యుత్ సౌకర్యాలు, విద్యార్థులకు టాయిలెట్స్ సౌకర్యం తదితర సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. ఈసందర్భంగా తహసీల్దార్ కరుణాకర్ మాట్లాడుతూ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బంది ని ఆదేశించారు. . పరీక్ష కేంద్రంలోని ప్రధాన కార్యాలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని చెప్పారు. కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. కేటిదొడ్డి మండలంలోని నందిన్నెలో 214, పాతపాలెం 204 మొత్తం 414 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నట్లు ఎంఈఓ విజయభాస్కర్ తెలిపారు. వారి వెంట ఆర్ఐ నాగేష్, పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పదవ తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు శుభాకాంక్షలు

### కొమురవెల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 13(ప్రభాత ఉదయం):**



తెలంగాణ రాష్ట్రంలో నేటి నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్న విద్యార్థులం దరికీ కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పదవ తరగతి పరీక్షలు ప్రతి విద్యార్థి విద్యా ప్రస్థానంలో కీలకమైన మైలురాయి అని ఆయన పేర్కొన్నారు. ఈ పరీక్షలను భయం, ఆందోళనలకు లోనుకాకుండా ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొని ప్రశాంతంగా రాయాలని విద్యార్థులకు సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో పరీక్షలకు సిద్ధమైతే భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించగలరని ఆయన అన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని, ఈ పరీక్షల్లో విజయం సాధించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకుని రాష్ట్రానికి, దేశానికి కీర్తి తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షలు రాయనున్న ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించాలని కొమురవెల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్ హృదయపూర్వకంగా అభిలషించారు.

# జోరుగా రేషన్ దందా.. రేషన్ డీలర్ల ఇష్టారాజ్యం

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 13(ప్రభాత ఉదయం)**

ప్రభుత్వం పేద ప్రజల కడుపు నింపేందుకు పంపిణి చేస్తున్న సన్న బియ్యం కొందరు అక్రమార్కులు పక్కదారి పట్టిస్తున్నారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టడంలో రేషన్ డీలర్‌లు కీలక పాత్ర పోషిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో పేద ప్రజలకు చేరవలసిన సన్న బియ్యంను వనపర్తి జిల్లా రాయచూర్ ప్రాంతాలకు తరలి వెళ్తున్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో రేషన్ డీలర్లు స్వయంగా కార్డుదారుల నుంచి కేజీ 15 రూపాయలు చొప్పున కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు చేసిన బియ్యాన్ని నేరుగా మధ్యవర్తులకు విక్రయిస్తున్నారు. ఇలా మధ్యవర్తుల ద్వారా కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ జిల్లాకు, వనపర్తి జిల్లాలో పలు మిల్లులకు తరలిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత కొంతకాలంగా బహిరంగానే రేషన్ దందానడుస్తున్న అక్రమ వ్యాపారులు ఎవడ్రా మమ్మల్ని పట్టుకునేది అంటూ కాలర్ ఎగరవేస్తు దర్జాగా దందాను మొదలుపెట్టారు.

**డీలర్లు గప్‌చుప్‌గా..**

జిల్లాలో కొందరు రేషన్ డీలర్లు సన్న బియ్యం వ్యాపారం గప్‌చుప్‌గా నడిపిస్తున్నారని తెలుస్తోంది. కార్డుదారులు వేలిముద్ర వేస్తే బియ్యంకు బదులుగా నగదు బదిలీ చేశారని ఆరోపణలు ఉన్నాయి. రేషన్ డీలర్లు వేలిముద్ర వేసిన లబ్ధిదారులకు కిలో రూ 15 వరకు చెల్లించారు. సన్న బియ్యం కూడా మళ్లీ పొరుగు రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు. రేషన్ బియ్యం కొనుగోలు అక్రమార్కులకు లాభదాయకంగా మారిందని చెప్పుకుంటున్నారు.



**రేషన్ దుకాణల నిర్వహణ ఇష్టారాజ్యం**

జిల్లాలో రేషన్ దుకాణాల నిర్వహణ ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నది. పేరు ఒకరిదైతే నిర్వహణ మరొకరు చేస్తూ రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రేషన్ దుకాణం దక్కించుకున్న డీలర్, వివిధ కారణలతో తొలగించిన డీలర్ల స్థానంలో కేటాయించిన ఇన్‌చార్జ్‌లు మాత్రమే సరుకులు పంపిణీ చేయాలి. అలా కాకుండా బినామీలు నిర్వహిస్తూ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. దీనికి తోడు డీలర్లకు మాత్రమే తెలియాల్సిన ఈ-పాస్ మిషన్ల కీ రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా బినామీల చేతుల్లోకి వెళ్లాయి. దీంతో వారే ఓపెన్ చేసి బియ్యం పంపిణీ చేస్తున్నారు.

రేషన్ దుకాణాలపై పర్యవేక్షణ లేకపోవడంతో బినామీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో బినామీ డీలర్లు కీ రోల్ పోసిస్తున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు స్పందించి పేదల బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**గతంలో పలు కేసులు**

రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న పలువురిపై గతంలో కేసులు నమోదయ్యాయి. కొందరిపై పీడీ యాక్టు సైతం నమోదు చేసినప్పటికీ దందాను మాత్రం ఆపలేదు. ఓ వైపు కేసులు నమోదువుతున్నా మరోవైపు బియ్యం అక్రమ దందా కొనసాగుతూనే ఉండంతో అధికారుల కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

చర్యలు తీసుకుంటున్నాం రేషన్ బియ్యం తరలించే వారిపై చర్యలు తీసుకుంటున్నాం. పీడీఎస్ బియ్యం నిల్వలు ఉన్నట్లు సమాచారం అందితే వెంటనే చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు తెలిస్తే వెంటనే మాకు సమాచారం అందించాలి.

--స్వామి కుమార్- డిఎస్ఓ

# శేరిలింగంపల్లిలో ముందే మొదలైన 'మున్సిపల్' ముచ్చట

## గల్లీ గల్లీలో నేతల హడావిడి!.. ఆశావాహుల ఫ్లెక్సీలతో నిండిపోతున్న గల్లీలు

**శేరిలింగంపల్లి : మార్చి 13,( ప్రభాత ఉదయం )**

ఐటీ హబ్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు దిశగా అడుగులు పడుతుండటంతో, శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రాజకీయ సెగ అప్పుడే మొదలైంది. ఎన్నికల నగారా మోగకముందే ఆశావాహులు క్షేత్రస్థాయిలో పాగా వేసేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. ఐటీ కారిడార్‌గా పేరుగాంచిన ఈ ప్రాంతంలో అధికారం కోసం ప్రధాన పార్టీల నేతలతో పాటు యువత కూడా "సై" అంటోంది.



**ఏడు నుండి పద్దెనిమిదికి.. మారిన ముఖచిత్రం!**

గతంలో కేవలం ఏడు డివిజన్లకే పరిమితమైన శేరిలింగంపల్లి ఇప్పుడు ఏకంగా 18 డివిజన్లుగా విస్తరించబోతోంది. వార్డుల పునర్విభజనతో కొత్త సమీకరణాలు తెరపైకి వచ్చాయి. విస్తీర్ణం పెరగడం, కొత్త వార్డులు ఏర్పాటు కావడంతో గతంలో అవకాశం రాని ద్వితీయ శ్రేణి నాయకులకు ఇప్పుడు అదృష్టం తలుపు తట్టినట్లయింది. ప్రతి గల్లీలోనూ ఇప్పుడు ఒక అభ్యర్థి తయారయ్యారు.

**ఫ్లెక్సీల హోరు.. ప్రచార జోరు!**

పండుగ వచ్చినా, పుట్టినరోజు వచ్చినా.. కారణం ఏదైనా శేరిలింగంపల్లి వీధులు ఇప్పుడు ఆశావాహుల ఫ్లెక్సీలతో నిండిపోతున్నాయి.

సంక్రాంతి నుండి మొదలుకొని స్థానిక ఆలయ ఉత్సవాల వరకు ప్రతి సందర్భాన్ని నేతలు ఓటర్లకు చేరువయ్యేందుకు వాడుకుంటున్నారు.

**సోషల్ మీడియా వార్**

గ్రౌండ్ లెవల్‌లో తిరగడమే కాకుండా, వాట్సాప్ గ్రూపులు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో తాము చేసే సామాజిక కార్యక్రమాలను ప్రచారం చేసుకుంటూ ఓటర్ల నోళ్లలో నానేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. సిఎంసి కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న నాయకులు ఏదో ఒక కార్యక్రమం చేస్తూ ప్రజల నోట్లో నానెందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

**వారసుల ఎంట్రీ.. బంధువుల సందడి!**

ఈసారి ఎన్నికల్లో మరో ఆసక్తికర అంశం 'వారసులన కూడా రాజకీయాలలోకి దింపెందుకు ప్రయత్నాలు ప్రారభించారు. గతంలో కార్పొరేటర్లుగా పనిచేసిన వారు, సీనియర్ నేతలు తమ తనయులను లేదా సన్నిహిత బంధువులను రంగంలోకి దించేందుకు సిద్ధమవుతున్నారు.

తమ రాజకీయ పట్టును కాపాడుకోవడానికి కుటుంబ సభ్యులే సరైన వారనే భావనలో పాత నేతలు ఉన్నారు. నియోజకవర్గంలోని పలు కీలక డివిజన్లలో ఇప్పటికే వారసులు పర్యటనలు చేస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారు.

**యువత 'జోష్'.. అర్థబలం, అంగబలం!**

సాంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా ఈసారి విద్యావంతులైన యువత, వ్యాపార రంగంలో రాణిస్తున్న యువ నాయకులు ఎన్నికల బరిలో నిలిచేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

కేవలం ఓటు వేయడమే కాదు. మార్పు కోసం మేమే పాలకులం కావాలి" అనే నినాదంతో యువత ముందుకు వస్తోంది.

ఆర్థికంగా బలంగా ఉండటం, స్థానిక యువజన సంఘాల్లో పట్టు ఉండటంతో వీరు ప్రధాన పార్టీల టిక్కెట్ల కోసం గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. పార్టీలు టిక్కెట్లు ఇవ్వకపోయినా, స్వతంత్రులుగానైనా పోటీ చేసేందుకు వెనకాడటం లేదు.

**త్రిముఖ పోరుకు సిద్ధమైన ప్రధాన పార్టీలు**

శేరిలింగంపల్లిలో ప్రధానంగా కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి మధ్య హోరాహోరీ పోరు నెలకొనే అవకాశం ఉంది. కాంగ్రెస్ అధికార పార్టీ కావడంతో ఆశావహుల సంఖ్య భారీగా ఉంది. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ మైలేజ్ పొందే ప్రయత్నంలో ఉన్నారు. బిఆర్ఎస్ క్షేత్రస్థాయిలో ఉన్న బలమైన క్యాడర్, గతంలో చేసిన అభివృద్ధి పనుల ఆధారంగా మళ్ళీ పట్టు సాధించాలని చూస్తోంది. బిజెపి ఐటీ ఉద్యోగులు, పట్టణ ఓటర్లపై ఆశలు పెట్టుకున్న బిజెపి, మార్పు కోరుకునే ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్లాన్ చేస్తోంది.

**ఓటరు నాడి ఎటు?**

సమస్యలు అనేకం ఉన్న ఈ నియోజకవర్గంలో ఓటరు ఎవరి వైపు మొగ్గు చూపుతారనేది ఆసక్తికరంగా మారింది. డ్రైనేజీ సమస్యలు, ట్రాఫిక్ కష్టాలు, తాగునీటి ఇబ్బందులను పరిష్కరించే వారికే ఓటు వేస్తామని ప్రజలు చర్చించుకుంటున్నారు. నేతల హడావిడి చూస్తుంటే, ఎన్నికల నాటికి శేరిలింగంపల్లి రాజకీయ రణక్షేత్రంగా మారడం ఖాయంగా కనిపిస్తోంది.



నీటిపారుదల అధికారులతో సమీక్షా చేస్తున్న జిల్లా కలెక్టర్

# వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు చేపట్టాలి

### ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడంలో నిర్లక్ష్యం వహించకూడదు

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 13(ప్రభాత ఉదయం):**

వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శుక్రవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సురక్షిత తాగునీటి సరఫరా, నీటి వనరుల నిర్వహణపై ఎంపిడిఓలు, నీటి పారుదల, మిషన్ భగీరథ అధికారులతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో గల అన్ని మండలాల వారీగా నీటి లభ్యతపై క్షుణ్ణంగా సమీక్షించి, వివరాలను అడిగి తెలుసుకొని, పలు సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి వనరుల పరిస్థితిని అధికారులు నిరంతరం పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పని చేయకుండా ఉన్న బోర్లు, నీటి సరఫరా పైప్ లైన్లు, చేతి పంపులను వెంటనే మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. నీటి నిల్వ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయడానికి ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా నిరంతరం జరిగేలా చూడాలన్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ఎండాకాలంలో ఎక్కడా కూడా తాగునీటి కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు తాగునీటి సమస్యలు ఎదురైతే వెంటనే స్పందించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అదే విధంగా గ్రామాలు, పట్టణాల్లోని ప్రజలకు తాగునీటి సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించేందుకు టోల్ ఫ్రీ నంబర్ 1800 ను కలెక్టరేట్ లో ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో ఇంచార్జ్ డీపీఓ వసంత, ఈఈ మిషన్ భగీరథ (ఇంట్రా) శ్రీకాంత్, ఈఈ మిషన్ భగీరథ (గ్రిడ్) సూర్య, నీటి పారుదల శాఖ ఎస్ఈ సీతారాం, ఈఈ రాజు, అన్ని మండలాల ఎంపీఓలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని అందచేస్తున్న బనుక శివరాజ్

# మన గ్రామానికి వన్నె తెచ్చే విధంగా పలితాలు ఉండాలి

### జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బనుక శివరాజ్

### సాదం శ్రీరంగం జ్ఞాపకార్థం విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణి

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 13(ప్రభాత ఉదయం):**

జనగామ మండలం, శామీర్ పేట గ్రామంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాల లో సాదం శ్రీరంగం జ్ఞాపకార్థం వారి కుమారులు సాదం మధుసూదన్ యాదవ్, సాధం చిన్న యాదవ్ శుక్రవారం పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి ని పంపిణి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి విధార్థి, విద్యార్థినిలు ఎస్ఎస్సి పరీక్షలో ప్రతిభ చూపుతూ మన గ్రామానికి వన్నె తెచ్చే విధంగా పలితాలు ఉండాలని అన్నారు. అదేవిధంగా భవిష్యత్తులో మంచి మార్కులు వచ్చిన మొదటి , రెండవ, మూడవ ర్యాంక్ ల వారికి ఆర్థిక బహుమతులు కూడా అందిస్తామని అన్నారు. మరి ముఖ్యంగా జనగామ డివిజన్ లో మన గ్రామం నుండి మొదటి స్థానంలో వచ్చిన విద్యార్థికి ఇంటర్మీడియట్ చదువు కోసం ఆర్థిక సాయం అందిస్తామని కూడా అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చాడ కొండ కృష్ణ రెడ్డి, సీనియర్ నాయకులు బాల్నే సుధాకర్, బత్తుల లక్ష్మీనారాయణ, కంసాని భాస్కర్ రెడ్డి, పత్తి నరేందర్, తాంద్ర ప్రవీణ్, ఎస్సి సెల్ అధ్యక్షులు చాంద్ర నర్సింగరావు, బనుక వీరస్వామి, మేడుదుల రాజు, ఎస్కె పాషా ఉపాధ్యాయులు నీరజ, పద్మజ, స్పందన, శారదమ్మ, వజ్రయ్య, శ్రీనివాసులు, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ మధ్యకాలంలో యాక్సిడెంట్ అయి చికిత్స పొందుతున్న బండిగారి శివకృష్ణ ని పరామర్శించి ఆర్థిక సాయం కాంగ్రెస్ పార్టీ నాయకులు అందించారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలి

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 13(ప్రభాత ఉదయం):**



జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి పైన గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలెక్టర్ శుక్రవారం మినీ కాన్ఫరెన్స్ హాల్ లో సమీక్షా నిర్వహించారు. జిల్లా లో మంజూరు అయిన ఇండ్లు ఇప్పటి వరకు ఏ ఏ దశ లో ఉన్నాయని.. ఎఈ ల వారీగా కలెక్టర్ రివ్యూ చేసి... వివరాలను అడిగి తెలుసుకొని ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలనీ వారికి లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇప్పటివరకు జిల్లా లో రెండు విడత లుగా 5647 ఇల్లు మంజూరు కాగ... 241 ఇల్లు నిర్మాణం పూర్తి అవ్వగా..స్లాబ్ లెవల్ లో 2920, రూఫ్ లెవల్ లో 544, బెస్మెంట్ లో 1128... మార్క్ ఔట్ అయినప్పటికీ బెస్మెంట్ లెవల్ కి రాని ఇల్లు 450 ఉన్నాయని పీడీ హోసింగ్ తెలిపారు. ఈ సమావేశం లో పీడీ హోసింగ్ మాత్రు నాయక్, డిఈ, ఎ ఈ లు పాల్గొన్నారు




# దర్జాగా ఫిల్టర్ ఇసుక దందా

**గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి 9 ప్రభాత ఉదయం**

అధికారులు, ప్రజాప్రతినిధులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో గద్వాల మండలం గోనుపాడు, సంగాల గ్రామాలలో ఫిల్టర్ ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను విక్రయిస్తూ అక్రమార్కులు సొమ్ముచేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. నాణ్యతలేని ఇసుకను ఇంటి నిర్మాణాలకు తరలిస్తున్నా పట్టించుకునే వారు కరవయ్యారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. గద్వాల మండలం గోనుపాడు, సంగాల గ్రామ శివారులో గుట్టుచప్పుడు కాకుండా ఫిల్టర్ ఇసుక తయారీ మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా నడుస్తుంది.అటువైపు రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్ శాఖ అధికారులు కన్నెత్తి చూడడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే మట్టి త్రవ్వకాలు జరిపి ఫిల్టర్ ఇసుక తయారీ చేస్తున్నారు. వాల్టా చట్టానికి తూట్లు పెడుతున్నారు.రెవెన్యూ,ఇరిగేషన్ శాఖ అధికారులు నిద్ర మత్తులో మునిగి పోతున్నారు అనే విమర్శలు వస్తున్నాయి.

**అబాసు పాలవుతున్న ఉచిత విద్యుత్..**

ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తుంటే దానిని ఇసుక వ్యాపారులు అడ్డదారుల్లో మట్టిని ఫిల్టర్ చేయడానికి వాడుతున్నారు. ప్రతిరోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో మట్టిని తీసుకువచ్చి తమ వ్యవసాయ బోరు బావుల వద్ద నీటితో మట్టిని ఫిల్టర్ చేస్తూ ఇసుకను తయారు చేస్తున్నారు. అయినా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు ఈ వ్యవహారం కనిపించకపోవడం శోచనీయం. విద్యుత్ అధికారులతో సంబంధిత ఇసుక వ్యాపారులు బేరం కుదుర్చుకున్నారన్నా ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఇసుక వ్యాపారులకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



# రంజాన్ పండుగను ముస్లిం సోదరులు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

### ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంత్ రావు

**కుత్బుల్లాపూర్, మార్చి 13 (ప్రభాత ఉదయం)**





రంజాన్ పండుగను ముస్లిం సోదరులు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని మల్కాజ్ గిరి మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంత్ రావు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం రంగారెడ్డి నగర్ డివిజన్ లో రంజాన్ పండుగ సందర్భంగా ముద్దపురం శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో ఎన్.ఆర్ ప్యాలెస్ లో ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మైనంపల్లి హనుమంతరావు హాజరై ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు ఏర్పాటుచేసిన విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంత్ రావు మాట్లాడుతూ రంజాన్ పండుగ ఉత్సవాన్ని ముస్లిం సోదరులు ప్రజలలో మమేకమై పండుగను జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, వెంకటేశ్వర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందుల శివకుమార్, ప్రగతి నగర్ వన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రఘు గౌడ్, కోశాధికారి శంకర్రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్పీ పరశురాం, పంతం వెంకటేశ్వర్లు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శిల్పా బృందావన్‌లో శ్రీ కోదండ రామ స్వామి వారి వార్షికోత్సవం

### ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్ పల్లి, మార్చి 13 (ప్రభాత ఉదయం)**



శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలోని శిల్పా బృందావన్ కాలనీలో వెలసిన శ్రీ కోదండరామ స్వామి వారి వార్షికోత్సవాన్ని శేరిలింగంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎర్రబెల్లి సతీష్ రావు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ శ్రీ కోదండరామస్వామి దయవల్ల ప్రజలందరూ సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో తులతూగాలని ఆ భగవంతుని వేడుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రుడయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, తూమ్ శ్రావణ్ కుమార్, భక్తులు కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి వార్షికోత్సవని విజయవంతం చేశారు.



# వెంకన్న కాలేజీలో పనిచేస్తున్న మహిళా మీనాక్షికి రావలసిన వేతనాన్ని ఇప్పించిన కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి

**కుత్బుల్లాపూర్, మార్చి 13 (ప్రభాత ఉదయం)**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, చింతల్ లోని వెంకన్న కాలేజీ లో రిసెప్షన్ గా పనిచేస్తున్న మీనాక్షి, గత కొన్ని నెలలు నుంచి పని చేస్తుంది. మీనాక్షి అనే మహిళ కొన్ని అనివార్య కారణాలవల్ల మీనాక్షి కి రావాల్సిన వేతనం రెండు నెలల 20 రోజుల వేతనం మొత్తం 48000/- వేల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా అవి ఇవ్వకపోవడంతో వెంకన్న కాలేజ్ రిసెప్షన్ లో పని మానేయడం జరిగింది. ఆ మహిళ మీనాక్షికి ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే మనకు న్యాయం చేస్తారో అని తోటి మహిళ మిత్రురాల ద్వారా తెలుసుకొని, బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి ఆఫీస్ వద్దకు వెళ్లి మీనాక్షి కి జరిగిన అన్యాయం గురించి వివరించారు, వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవి హుటాహుటిన "చింతల్ లో ఉన్న వెంకన్న కాలేజ్" మేనేజ్ మెంట్ తో పలుమార్లు చర్చించి మీనాక్షి కి రావలసిన వేతనం 48000/- వేల రూపాయలు మొత్తం ఇప్పించాడు. మీనాక్షి మాట్లాడుతూ ,నాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

# పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు.. సామాన్యుడి వంటింట్లో సెగలు!



అమెరికా, ఇజ్రాయెల్ క్షిపణి దాడి అనంతరం టెహ్రాన్‌లో అలముకున్న పొగ



ఇరాన్ దాడి అనంతరం ఓ భవనంలో మంటలను ఆర్పుతున్న సిబ్బంది..




### హార్మూజ్ సెగ.. పేదవాడి పొయ్యి ఆరక తప్పదా?

### ఖమేనీ హెచ్చరికలు - తెలంగాణ హాస్టళ్లలో గ్యాస్ కష్టాలు!

### జయశంకర్ దౌత్యం ఫలించినా.. చమురు క్షేత్రాలపై దాడులతో గందరగోళం.

### కమర్షియల్ గ్యాస్ కొరత: గ్యాస్ బండకు బదులు మళ్ళీ కట్టెల పొయ్యి వైపు!

**శేరిలింగంపల్లి : మార్చి 13, (ప్రభాత ఉదయం)**

ప్రపంచ పటంలో ఎక్కడో వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న పశ్చిమాసియాలో రేగిన యుద్ధ జ్వాలలు ఇప్పుడు నేరుగా మన రాష్ట్రంలోని వంటిళ్లలోకి చేరాయి. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికాల మధ్య జరుగుతున్న దాడులు, ప్రతిదాడుల ప్రభావం అంతర్జాతీయ చమురు మార్కెట్‌ను అతలాకుతలం చేస్తోంది. ముఖ్యంగా ఇరాన్ తన ఆధీనంలోని స్ట్రెయిట్ ఆఫ్ హార్మూజ్ జలసంధిని మూసివేస్తామని హెచ్చరించడం ప్రపంచవ్యాప్త ఇంధన సరఫరాపై పిడుగులా పడింది.

**సౌదీ చమురు క్షేత్రాలపై దాడులు - పెరిగిన భారం**

ఇరాన్ తాజాగా సౌదీ అరేబియాలోని అతిపెద్ద షెబా చమురు క్షేత్రంపై డ్రోన్ దాడికి పాల్పడటం గ్యాస్, ముడి చమురు ధరలను ఆకాశానికి చేర్చింది. కేంద్ర ప్రభుత్వం నుండి వాణిజ్య గ్యాస్ సరఫరాపై స్పష్టమైన ఆదేశాలు లేకపోవడంతో, స్థానిక డీలర్లు నిల్వలను తగ్గించుకుంటున్నారు. దీని ప్రభావం నగరంలోని వేల సంఖ్యలో ఉన్న హోటళ్లు తోపాటు హాస్టళ్లపై పడింది.

**నగరంలో కమర్షియల్ గ్యాస్ నిల్.. కట్టెల పొయ్యే దిక్కు!**

హైదరాబాద్‌లోని 11వేల హాస్టళ్లకు వంట గ్యాస్ సరఫరా నిలిచిపోయింది. కావల్సినంత కమర్షియల్ గ్యాస్ సరఫరా లేకపోవడంతో హాస్టల్ నిర్వహకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కమర్షియల్ సిలిండర్ల ధరలు పెరగడమే కాకుండా, స్టాక్ దొరకకపోవడంతో నిర్వాహకులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. చాలా చోట్ల గత్యంతరం లేక కట్టెల పొయ్యిలపై వంటలు చేస్తున్నారు. దీనివల్ల వంట మనుషులు తీవ్రమైన పొగబారిన పడటమే కాకుండా, సమయానికి భోజనం అందించలేక హాస్టల్ విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు.

**జయశంకర్ దౌత్యంతో కొంత ఊరట**

భారత విదేశాంగ మంత్రి ఎస్. జయశంకర్ జరిపిన చాకచక్యమైన చర్చల ఫలితంగా ఇరాన్ మన దేశానికి చెందిన ఆయిల్ షిప్పులను పంపేందుకు అంగీకరించింది. ఇది కొంతవరకు ముడి చమురు కొరతను తగ్గించినప్పటికీ, అంతర్జాతీయంగా ధరలు తగ్గకపోవడంతో దేశీయంగా గ్యాస్ సిలిండర్ల సరఫరా గాడిలో పడటం లేదు.

**ప్రజల ఆవేదన**

కేవలం వాణిజ్య గ్యాస్ మాత్రమే కాకుండా, డొమెస్టిక్ గ్యాస్ (ఇంటి గ్యాస్) సరఫరాలో కూడా జాప్యం జరుగుతోంది. "గ్యాస్ సిలిండర్ బుక్ చేసిన పది రోజులు దాటినా రావడం లేదు, పాత రోజుల్లా మళ్ళీ పొయ్యి రాజేయాలా?" అని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు. యుద్ధం ఆగి, సరఫరా సాధారణ స్థితికి రాకపోతే పరిస్థితి మరింత విషమించే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పశ్చిమాసియా మంటలు చల్లారే వరకు మన వంటిళ్లలో ప్రశాంతత కరువే అనిపిస్తోంది. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి, గ్యాస్ నిల్వలను సక్రమంగా పంపిణీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# సకాలంలో ఇంకుడు గుంతలు పునరుద్ధరించుకోవాలి





### జల సంరక్షణలో అందరూ భాగం కావాలి

### బస్తీ బాటలో పాల్గొన్న జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 13(ప్రభాత ఉదయం)**

హైదరాబాద్ నగరంలో అడుగంటున్న భూగర్భ జలాలను పెంచేందుకు నగరంలో ఇప్పటికే నిర్మించిన ఇంకుడు గుంతలను పునరుద్ధరణ చేసుకోవాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అన్నారు. జలమండలి నిర్వహిస్తున్న 'జల మండలి.. బస్తీబాట' కార్యక్రమం భాగంగా బాగ్ లింగంపల్లి వార్డు, ముషీరాబాద్ సర్కిల్ డివిజన్ 17 పరిధిలోని పద్మ కాలనీ ప్రాంతంలో జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులతో కలిసి పర్యటించారు. ఉదయం నీటి సరఫరా సమయంలో పలు నివాసాలలో నీటి సరఫరా వాకబు చేసిన ఎండీ నీటి నాణ్యత, సమయం పాలన తదితర వివరాలను స్థానికులను ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. అలాగే.. ప్రాంతంలో పలు నివాసాల్లో నీటి వృధాను గుర్తించిన ఎండీ.. విలువైన తాగునీటిని తాగునీటికి కాకుండా ఇతర అవసరాలకు ఉపయోగిస్తే జరినామాలు విధించడంతోపాటు అవసరమైతే కనెక్షన్లు కూడా తొలగిస్తారని అన్నారు. ఈ పర్యటనలో సందర్భంగా తాగునీటిని వృథా చేస్తున్న వినియోగదారులను గుర్తించి, ఎండీ ఆదేశాల మేరకు వారికి అధికారులు జరిమానాలు విధించడంతో పాటు, అవసరమైన చోట నీటి కనెక్షన్ కూడ తొలగించారు. అదేవిధంగా బాగ్‌లింగంపల్లి వార్డు పరిధిలోని ఆదిత్య అపార్ట్‌మెంట్‌లో వర్షపు నీటి సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలను పునరుద్ధరించే పనులలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. జలమండలి అధికారులు ప్రజలకు తాగునీటిని వృథా చేయకుండా బాధ్యతగా వినియోగించాలని, నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరానికి గోదావరి, కృష్ణ నదుల నుంచి దాదాపు 200 కిలోమీటర్ల దూరంలో మంచినీటిని సేకరించి, శుద్ధి చేసి నగరవాసులకు జలమండలి సరఫరా చేస్తోందన్నారు. ఇందుకోసం జలమండలి ఎన్నో వ్యయప్రయాసలు పడుతోందన్నారు. అయితే, కొంతమంది మాత్రం అవగాహనారాహిత్యంతో నీటిని వృథా చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో నీటి ఇబ్బందులు వస్తాయనే అవగాహన కూడా చాలామందిలో లేదని అభిప్రాయపడ్డారు. ఇప్పుడు నీటిని సంరక్షించుకోకపోతే భవిష్యత్తులో చాలా ఇబ్బందులు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. అమూల్యమైన నీటిని గృహావసరాలకు వినియోగించుకున్న తర్వాత ఉన్న సాంకేతికతతో శుద్ధి చేసి, ఆ నీటినే నిర్మాణ, గార్డెనింగ్ వంటి ఇతర అవసరాలకు కూడా ఉపయోగించడానికి ప్రయత్నించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి సిజిఎం ప్రభు, జిఎం శ్రీధర్ రెడ్డి డిజిఎం ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ పోలీస్ అకాడమీలో

# మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం






**హైదరాబాద్, (బండ్లగూడ),మార్చి13 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్‌లోని ఆర్‌బివిఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో ఈ రోజు ఉదయం మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సహకారంతో అకాడమీ మెడికల్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ శిబిరాన్ని అకాడమీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి , గ్రేస్ ఫౌండేషన్ ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళల్లో క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించడం, నివారణ చర్యలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ముఖ్యంగా మహిళల్లో పెరుగుతున్న రొమ్ము క్యాన్సర్ , గర్భాశయ ముఖ క్యాన్సర్ (సర్వికల్ క్యాన్సర్) కేసులను దృష్టిలో ఉంచుకొని అర్హులైన మహిళలకు ప్రత్యేక స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించబడ్డాయి. ఈ శిబిరంలో మహిళా పోలీస్ అధికారులు, మహిళా హోం గార్డులు, అలాగే అకాడమీ అధికారులు మరియు సిబ్బంది కుటుంబ సభ్యులైన మహిళలు పాల్గొన్నారు. వివాహిత మహిళలు 25 నుండి 65 సంవత్సరాల వయస్సు గల వారికి పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించగా, 40 నుండి 65 సంవత్సరాల వయస్సు గల మహిళలకు మామోగ్రఫీ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 100 మంది మహిళలు ఈ శిబిరంలో పాల్గొన్నారు. అందులో 40 మంది మామోగ్రఫీ పరీక్ష చేయించుకోగా, 66 మంది పాప్ స్మియర్ పరీక్షలు చేయించుకున్నారు. అకాడమీ ప్రాంగణంలోనే ఈ ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించడం వల్ల మహిళలకు పరీక్షలు సులభంగా అందుబాటులోకి వచ్చాయని పాల్గొన్న మహిళలు ఆనందం వ్యక్తం చేస్తూ అకాడమీ యాజమాన్యానికి , నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, ఐపీఎస్, అకాడమీ డిప్యూటీ డైరెక్టర్లు కె.ఆర్.కె. ప్రసాద్, మధుకరస్వామి, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ప్రతినిధులు మరియు అకాడమీ మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.



# కూకట్‌పల్లి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

### నల్లచెరువు దగ్గర ప్రజలకు ఉపయోగపడే విధంగా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి

### మున్సిపల్ కమిషనర్ జి. శ్రీజన, ఐఏఎస్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్ పల్లి, మార్చి 13 (ప్రభాత ఉదయం)**

సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ జి. శ్రీజన, ఐఏఎస్ ని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మర్యాద పూర్వకముగా కలిసి కూకట్ పల్లి నియోజకవర్గం లో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని వినతి పత్రాన్ని అందించారు. అలాగే కూకట్ పల్లి నల్ల చెరువు ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయడం జరిగింది కానీ చెరువు దగ్గర పలు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది. ఇందులో భాగంగా మహిళలకు, పురుషులకు, చిన్న పిల్లల పార్కు ఆట పరికరాలు, వాకింగ్ ట్రాక్, యోగ, ఇండోర్ స్టేడియం, పార్కులో 30 బెంచీలు, లైబ్రరీ మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. అలాగే రామారావు నగర్ నాలా పనులు చేపట్టడం జరిగింది ఇట్టి నాలాపై సుమారుగా 500 ఫీట్లు పనిచేయవలసిందే కావున నాలాపై స్లాబ్ ఏర్పాటుకి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాల్సిందిగా కోరారు. అలాగే మూసాపేట చౌరస్తా నుండి ఆంజనేయ నగర్ వరకు రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని, బాలానగర్ గత కొన్ని సంవత్సరాలుగా పేద ప్రజలకు ఉపయోగపడుతున్న రాజు కాలనీ కమ్యూనిటీ హాలు ఈఎస్ఐ డిస్పెన్సరీగా కేటాయిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైనది కాదు అని, స్థానిక పేదల అవసరాల కోసం నిర్మించిన కమ్యూనిటీ హాలు ను ఈఎస్ఐ కి అప్పగించారు అన్న నిర్ణయాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే కమ్యూనిటీ హాల్ను యధావిధిగా కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం మాజీ కార్పొరేటర్లు ఆవుల రవీందర్ రెడ్డి, తూము శ్రావణ్ కుమార్, పగడాల బాబురావు, పండాల సతీష్, మందాడి శ్రీనివాస రావు, సబిహా గౌసుద్దీన్, మాధవరం రంగారావు తదితరులు పాల్గొన్నారు.




# ముస్లిం మైనార్టీల పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుంది

### ఈద్ కా తుఫాను అందజేసిన టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్

**కూకట్ పల్లి, మార్చి 13 (ప్రభాత ఉదయం)**

ముస్లిం మైనార్టీల పట్ల సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈద్ కా తోఫా కానుకను శుక్రవారం మోతీనగర్ బబ్బుగూడలోని ముస్లిం మహిళలకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ వారికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. శాంతియుత వాతావరణంలో ప్రజల అందరితో కలిసి రంజాన్ ఉత్సవాన్ని జరుపుకుంటున్న ముస్లిం సోదరులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గోపిశెట్టి రాఘవేందర్, మజీద్ కమిటీ సభ్యులు, ఇమ్రాన్, ఇస్మాయిల్, సలీం, నయీం, బకరం బుచ్చయ్య, సుదాకర్ రెడ్డి, సలీం, రాజేష్, శ్రీను, ఇర్ఫాన్, వసీం, గోపాల్ చౌదరి, కమ్మర్ ఉద్దీన్, ఆనంద్ రెడ్డి, కోటిరెడ్డి, గోపాల్ చౌదరి వెంకటేష్ గౌడ్, షకీర్, రంగప్ప, కురువ రాజు, ప్రసాద్, శివ, సాథ్విక్ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద రైతులకు ఇన్పుట్‌ల పంపిణీ

**మహబూబ్ నగర్, మార్చి 13(ప్రభాత ఉదయం)**

శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ జిల్లా నవాబ్ పేట్ మండలం పరిధిలోని ఆరు గ్రామాల్లో భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ మండలి కింద ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక లో భాగంగా రైతులకి బ్యాటరీ స్ప్రేయర్లు, ప్లాస్టిక్ రేట్లను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా వర్సిటీ హార్టికల్చర్ డీన్ డాక్టర్ జే. చీన మాట్లాడుతూ తక్కువ పురుగుమందుతో తక్కువ కాలంలో ఎక్కువ పంట విస్తీర్ణంలో పిచికారీ కి బ్యాటరీ ఆపరేటర్ పిచికారి యంత్రాలు రైతులకు బాగా ఉపయోగపడతాయని తెలిపారు. అదే విధంగా పండ్లు కూరగాయలు ఎక్కువ కాలం తాజాగా ఉండేందుకు సంచులకు బదులుగా ప్లాస్టిక్ ప్లాస్టిక్ క్రేట్స్ వాడాలని ఈ సందర్భంగా అన్నారు. చిన్న, సన్న కారు రైతులు పంటలలో ఉత్పాదికత అధికంగా సాధిస్తున్నారని, వారు పండించే పంటలను నాణ్యత కూడా బాగుంటుందని ఈ సందర్భంగా తెలిపారు. తక్కువ విస్తీర్ణంలో సాగు చేయాలనుకున్నప్పుడు కూరగాయల సాగుకు రైతులు మొగ్గు చూపాలని, తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడులు తక్కువ కాలంలోనే పెట్టు పెట్టిన పెట్టుబడి కి తగిన ఫలితం, ఎక్కువ పని దినాలు కూరగాయలు పంటలతో సుస్వాదమని డాక్టర్ చిన తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పిడిగం సైదయ్య, కూరగాయల శాస్త్రవేత్త డాక్టర్ బి.ఎస్.కె నిఖిల్, ల్గడిగజేందర్, పాలమూరు రైతు డెవలప్మెంట్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్, ఎద్దుట్ల రామ్మోహన్ రెడ్డి ఎగ్జిక్యూటివ్ నెంబర్, పప్పు నరేందర్ రెడ్డి పాలమూరు రైతు డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు, నవాజ్ రెడ్డి మెంబర్, పప్పురఘునందన్ రెడ్డి సొసైటీ నెంబర్, పోమాల గ్రామ సర్పంచ్ కవిత నరేష్, డిప్యూటీ సర్పంచ్ బి ఆంజనేయులు, వార్డ్ మెంబర్లు, భీమన్న జైశ్రీరామ్ ఆంజనేయులు దప్పు శివ, ధర్పల్లి రామ్ రెడ్డి గారు భారతీయుకి శాంసంగ్ జిల్లా అధ్యక్షులు, మాదిరెడ్డి రాజిరెడ్డి గారు భారతీయ కిసాన్ సాంగ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జట్టి రాములు ఎగ్జిక్యూటివ్ నెంబర్ పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608